www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 29 సెప్టెంబర్ 2025
5
తిరుపతి



ఘనంగా గరుడోత్సవం

" గరుడ గమన రారా.. నను నీ కరుణను ఏలుకోరా.." - రామదాసు

" ఇటు గరుడని నీవెక్కినను.. పడమట దిక్కులు బగ్గన బగిలె .. " - అన్నమయ్య

ప్రజాశక్తి - తిరుమల: కలియుగ వైకుంఠం తిరుమల క్షేత్రం భక్త జన సంద్రంగా మారింది. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన ఆదివారం సాయంత్రం జరిగిన గరుడ వాహన సేవ అంగరంగ వైభవంగా, కన్నుల పండువగా సాగింది. బ్రహ్మోత్సవాల్లో 9 రోజుల పాటు స్వామివారు వివిధ వాహనాలపై ఊరేగుతూ దర్శనమిచ్చినా గరుడ వాహన సేవకు ఉన్న ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. ఈ రోజు మూల మూర్తికి అలంకరించే లక్ష్మీ కాసుల హారం, సహస్ర నామ మాల, పచ్చల హారాలను ఉత్సవ మూర్తి మలయప్ప స్వామికి అలంకరిస్తారు. శ్రీవారం ప్రియమైన వాహనం గరుత్మంతునిపై శ్రీ మలయప్ప స్వామి తిరుమాడ వీధుల్లో విహరించి, భక్త జన కోటిని కటాక్షించారు. స్వామివారిని దర్శించుకునేందుకు లక్షలాదిగా భక్తులు తరలిరావడంతో తిరుమల గిరులు గోవింద నామ స్మరణతో మార్మోగిపోయాయి. ఆర్టీసీ అధికారులు నిమిషానికి ఒక బస్సును తిరుమలకు ఏర్పాటు చేశారు. తిరుపతి నుండి దాదాపు పది చోట్ల బస్సుల్లో భక్తులు వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం సాయంత్రం 6.08 గంటలకు గరుడ వాహన సేవ ప్రారంభమైంది. స్వామి వారం వాహనం ముందు కళాకారులు వివిధ నృత్యాలు ప్రదర్శించారు, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని టీటీడీ గట్టి భద్రతా చర్యలు చేపట్టింది. మాడ వీధుల్లో దాదాపు 3 లక్షల మంది భక్తులు వాహన సేవలో పాల్గొన్నారు. హోల్డింగ్ పాయింట్ల ద్వారా మరో 35 వేల మంది గరుడ సేవను దర్శించుకున్నారు. గ్యాలరీలో ఉన్న భక్తులకు స్వామి వారి వాహన సమీపంలోకి అనుమతి లభించింది. ఎస్పీ సుబ్బ రాయుడు ఏఐ సాంకేతిక సహకారంతో ట్రాఫిక్‌ను పర్యవేక్షించారు. పోలీసు, విజిలెన్స్ సిబ్బంది రక్షణ చర్యలు పటిష్టంగా చేపట్టారు. తిరుమలలో అన్న ప్రసాదాలు పలు చోట్ల ఏర్పాటు చేశారు. సాయంత్రానికి వర్షం పడినప్పటికీ భక్తులు ఉత్సాహంగా వాహన సేవలో పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

- మన డబ్బులు-మనలెక్కలు యాప్‌తో పారదర్శకత
- ప్రజాశక్తి ముఖాముఖిలో డిఆర్డిఏ పిడి శోభన్ బాబు





ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా పరిధిలో మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ప్రణాళిక బద్ధంగా రుణ సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామని, మహిళా సంఘాలు, సమాఖ్యలలో సభ్యుల పొదుపు, లోన్లకు సంబంధించి లావాదేవీలను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవడానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మన డబ్బులు - మన లెక్కలు యాప్ అందుబాటులోకి తీసుకువచ్చిందని దీని ద్వారా లావాదేవీలలో పారదర్శకత ఏర్పడుతుందని జిల్లా డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్ బాబు ప్రజాశక్తి నిర్వహించిన ముఖాముఖిలో వెల్లడించారు. మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పలు రుణ సదుపాయాలను వివరించారు.

ప్రజాశక్తి: తిరుపతి జిల్లాలో ఎన్ని మహిళా సంఘాలు, ఎన్ని గ్రామ సంఘాలు, సభ్యులు ఎంతమంది ఉన్నారు?

డిఆర్డిఏ పిడి: తిరుపతి జిల్లాలో సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ (మహిళా సంఘాలు) 33,050 ఉన్నాయి. గ్రామ సంఘాలు/ సమాఖ్యలు 1280 ఉన్నాయి. సంఘం సభ్యులు 3,17,066 మంది ఉన్నారు.

ప్రజాశక్తి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షిక రుణ ప్రణాళికను వివరించండి?

డిఆర్డిఏ పిడి: తిరుపతి జిల్లాలో ఈ ఏడాది వార్షిక రుణ ప్రణాళిక ప్రకారం 21 వేల సంఘాలకు రూ.1390 కోట్ల రూపాయలు రుణాల మంజూరు చేయాలని లక్ష్యంగా చేసుకున్నాము. ఇందులో 6317 సంఘాలకు ఇప్పటికే రూ.463.5 కోట్ల రూపాయల బ్యాంకు లింకేజీ రుణాలను మంజూరు చేసాం. ఇప్పటివరకు రూ.604.1 కోట్లు పొదుపు, కార్పస్ నిధి రూ.918.3 కోట్ల రూపాయలుగా జిల్లాలోని సంఘాలకు సంబంధించిన నగదు ఉంది. అదేవిధంగా శ్రీనిధికి సంబంధించి రూ.320 కోట్లు లక్ష్యంగా ఎంచుకొని ఇప్పటివరకు 19785 మంది గాను రూ. 140 కోట్ల రూపాయల శ్రీనిధి లోను మంజూరు చేసాం. ఉన్నతి స్కీం ద్వారా జిల్లాలో ఉన్న ఎస్సీ ఎస్టీలకు సున్నా శాతం వడ్డీ రూపంలో రూ.18 కోట్ల రూపాయలను 3550 మందికి ఇవ్వాలని అర్హుల జాబితాను తయారుచేసాం. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా రైతులకు సంబంధించి రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటుచేసి తద్వారా వారికి కూడా రుణ సదుపాయాలను ఇవ్వాలని నిర్ణయించాం. అలానే ఇంటి వద్ద తినుబండారాలను తయారుచేసి విక్రయించే వారికి 50 పైసల వడ్డీతో రుణాలను మంజూరు చేస్తున్నాం. అలానే కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి మహిళల ఆర్థిక చైతన్యానికి ఉపయోగపడేలా ప్రణాళికలు చేశాం.

ప్రజాశక్తి: ఇటీవల మహిళా సంఘాలలో సంఘాల డబ్బులు దారిమళ్లటంపై ఒక ఆందోళన కారణ వాతావరణం ఏర్పడింది. వీటిని అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం ఏదైనా చర్యలు తీసుకుందా?

డిఆర్డిఏ పిడి: గత కొన్నేళ్లుగా మహిళా సంఘాలలో తీసుకున్న రుణాలకు సంబంధించి బ్యాంకులకు తిరిగి చెల్లించే క్రమంలో కొన్ని లోటుపాట్లు జరగడం, బ్యాంకుకు కట్టవలసిన డబ్బులు స్వాహా చేయడం వంటివి జరుగుతున్నాయి. ఇది ప్రభుత్వం దృష్టికి కూడా వెళ్ళింది. వీటిని అడ్డుకట్ట వేయడానికి, సంఘాల్లోని సభ్యులు వారి ఖాతాకు సంబంధించి లోన్లు, పొదుపు ఎంత ఉంది, ఇంకనూ ఎంత నగదు బ్యాంకుకు కట్టాల్సి ఉంది అన్న పూర్తి వివరాలను తెలుసుకోవడానికి మన డబ్బులు - మన లెక్కలు అనే ప్రత్యేక యాప్ ను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. దీని ద్వారా సంఘం సభ్యులు వారి లావాదేలకు సంబంధించి పూర్తి సమాచారాన్ని ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. ప్రత్యేకంగా చదువు రాని వారి కోసం మన డబ్బులు - మన లెక్కలు యాప్ లో ఏఐ టెక్నాలజీ సహాయంతో వాయిస్ ద్వారా కూడా సంఘం సభ్యులు లావాదేవీలను తెలుసుకొనే అవకాశం ఉంది. దీనివలన వారి లోన్లకు సంబంధించిన నగదు వారి ఖాతాల్లో ఎంతవరకు జమ అయ్యింది అన్న విషయాలు సభ్యుల నేరుగా తెలుసుకోవచ్చు. దీనిని పైలెట్ ప్రాజెక్టుగా తిరుపతి జిల్లాలో తిరుపతి రూరల్, రేణిగుంట, పాకాల, చంద్రగిరి మండలాలలో అమలు చేస్తున్నాం. ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి పూర్తిస్థాయిలో అన్ని మండలాలకు వర్తింపజేసేలా చర్యలు తీసుకున్నాం.

ప్రజాశక్తి: లోన్లు పొందడానికి టెక్నాలజీతో కూడిన ప్రత్యేక సదుపాయం ఏదైనా ఏర్పాటు చేశారా?

డిఆర్డిఏ పిడి: సంఘం సభ్యులు కొత్తగా లోన్లు తీసుకునే వారి కోసం ఆధార్ బయోమెట్రిక్ తో సంఘం సభ్యుల వేలు ముద్రల ద్వారా లోన్లు మంజూరు చేసేలా ప్రక్రియ మొదలైంది. మొదటగా లోను కావాలని కోరిన సభ్యుల అనుమతి మేరకు లోన్లు మంజూరు అయ్యేలా ప్రక్రియ కొనసాగింపబడుతుంది. సంఘం సభ్యులకు తెలియకుండా గతంలో వారి పేర్లపై లోన్లు తీసుకొని వాడుకోవడం జరిగిన సంఘటనలు ఉన్నాయి. వీటికి అడ్డుకట్ట వేయడానికి ఈ పారదర్శకమైన నూతన లోను మంజూరు ప్రక్రియను ప్రారంభించాం.

ప్రజాశక్తి: రెండు సంఘాలలో ఒకే సభ్యురాలు కొనసాగుతూ లోన్లను దుర్వినియోగం చేసినట్లుగా ప్రచారాలు జరుగుతున్నాయి. దీనిపై వివరించండి?

డిఆర్డిఏ పిడి: వాస్తవంగా సభ్యురాలు ఒకే సంఘంలో మాత్రమే ఉండాల్సి ఉంది. గతంలో మాన్యువల్ గా ఎంట్రీలు జరగడంతో ఇటు సీసీలు, బ్యాంకర్లు గుర్తించకపోవడంతో ఒకే సభ్యురాలు రెండు సంఘాలలో కొనసాగడం జరిగింది. వీటన్నింటినీ అరికట్టడానికి టెక్నాలజీతో కూడిన సదుపాయాలను మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం మంజూరు చేసే రుణ ప్రణాళికలో వినియోగిస్తున్నాం.

ఉగ్గుపాల నుండే కవితా సంపుటి పరిచయం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతికి చెందిన కథా రచయిత పేరూరు బాలసుబ్రమణ్యం రచించిన ఉగ్గుపాలనుండే కవితా సంపుటి పరిచయసభ ఆదివారం చెన్నైలోని అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక మందిరంలో జరిగింది. మహాకవి జాషువా జయంతి సందర్భం జరిగిన ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్ రెడ్డి, డాక్టర్ నిర్మల పళని వేలు, ఆచార్య విస్తాల శంకరరావు, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, డాక్టర్ మన్నవ గంగాధర్ ప్రసాద్, ఉపాధ్యాయులు యువ శ్రీ మురళి, ఏడుకొండలు, జనని సంస్థ ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య, నగరంలోని పలువురు సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

నృత్య లక్ష్మి అవార్డుల ప్రదానోత్సవం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: గుర్రం జాషువా హరిచంద్ర నాటకం కాటికాపరి పద్యాలతో గ్రామీణల హృదయాలలో కొలువైయున్నారని కుసుమ ధర్మన్న కళాపీఠం అధ్యక్షురాలు డాక్టర్.రాధ కుసుమ పేర్కొన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, కుసుమ ధర్మన్న కళా పీఠం సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ చిక్కడపల్లి, శ్రీత్యాగరాయ గానసభ కళాదీక్షితులు కళావేదికలో గుర్రం జాషువా జయంతి సందర్భంగా నృత్య లక్ష్మి అవార్డు ప్రదానోత్సవం జరిగింది. సూళ్లూరుపేటకు చెందిన కళాకారులు భానుతేజ, జాహ్నవి, యజ్ఞశ్రీ, నిత్యశ్రీ, లోహిత, జ్వలిత, నితికలను అవార్డుతో ఘనంగా సత్కరించారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్ రాజు మాట్లాడుతూ గుర్రం జాషువా సాహిత్యంలో జాతీయాభిమానం, సంఘ సంస్కరణల అభిలాష వీరి రచనల్లో వెల్లివిరుస్తాయని తెలిపారు. ఈకార్యక్రమంలో లయన్ డాక్టర్.ఎస్.రామచంద్ర రావు,అరుణ జ్యోతి, నాట్యగురువు గిరిజ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ రేబీస్ అవేర్నెస్ డే

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: వరల్డ్ రాబిస్ డే సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం నుండి డాక్టర్ బాలకృష్ణ నాయక్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ పెంపుడు జంతువులకు రాబిస్ వ్యాక్సిన్ వేయించాలని, కుక్క కరిచినప్పుడు వెంటనే ప్రథమ చికిత్స చేసి వైద్యులను సంప్రదించాలని, రేబిస్ వ్యాక్సిన్‌ను తీసుకోవాలని సూచించారు.

గుమ్మిడిపూడికి ఎక్సలెన్స్ అవార్డు

అవార్డు అందుకుంటున్న దశరథాచారి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టిడిపి సీనియర్ నేత, కళాసృష్టి సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గుమ్మిడిపూడి దశరథా చారిని రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వార్షిక ఎక్సెలెన్స్ అవార్డుతో సత్కరించింది. విజయవాడలో ఆదివారం జరిగిన ప్రపంచ పర్యాటక దినోత్సవ సదస్సులో సీఎం దశరథాచారికి అవార్డును, ప్రశంసా పత్రాన్ని బహూకరించడం జరిగింది. కళలు, సంస్కృతి, పర్యాటకాభివృద్ధికి తోడ్పాటు అందించిన పలువురికి ఈ అవార్డులు అందించారు. గుమ్మిడిపూడికి ఎక్సలెన్స్ అవార్డు రావడం పట్ల పలువురు అభినందనలు తెలియజేశారు.

సర్వే అకాడమీ భూములను రక్షించాలి

- భూములు ఆక్రమిస్తున్న అధికార పార్టీ వారిపై చర్యలు చేపట్టాలి : సిపిఎం నేత కందారపు మురళి డిమాండ్

జురుగా సాగుతున్న అక్రమ నిర్మాణాలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: మంగళం పరిసర ప్రాంతాల్లో, తిరుపతి రూరల్ మండలంలోని పలు ప్రాంతాలలో అధికార పార్టీ నాయకుల భూ ఆక్రమణలు, ఆగడాలు పెరిగిపోతున్నాయని వీటిని నియంత్రించి తక్షణమే అడ్డుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళం ప్రాంతంలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీ సర్వే నంబర్ 195/1లో ఖాళీగా ఉన్న రూ. కోట్ల విలువైన ప్రభుత్వ భూమిలో అధికార పార్టీ నేతలు అక్రమ నిర్మాణాలు చేస్తున్నా అడ్డుకోవాల్సిన రెవిన్యూ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని, కలెక్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో అక్రమ నిర్మాణాలు చేస్తున్నా, ప్రభుత్వ భూమిని కాపాడాలన్న పట్టుదల అధికారులలో లోపించడం పట్ల కందారపు మురళి ఆందోళన వ్యక్తం చేశారు. కోట్ల రూపాయల విలువ చేసే ఈ భూమిలో గత జూన్ నెలలో అక్రమ నిర్మాణాలు చేస్తుంటే, పునాదుల స్థాయిలోనే అడ్డుకొన్న తిరుపతి అర్బన్ మండల తహశీల్దార్, ఇతర ఉన్నతాధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారని కందారపు మురళి ప్రశ్నించారు. పేదవారి అక్రమణలను ఆఘమేఘాలపై తొలగించే రెవిన్యూ అధికారులు, ఎందుకు స్పందించడం లేదో సమాధానం చెప్పాలని కోరారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఆర్డిఓ రామ్మోహన్‌లు స్పందించి ఆక్రమణలను అడ్డుకోవాలని తిరుపతి అర్బన్ మంగళం ప్రాంతంలోను, రూరల్‌లోని వేదాంతపురం ప్రాంతంలో, మరికొన్ని ప్రాంతాలలో అధికార పార్టీ ఆగడాలు పెరుగుతున్నాయని వీటిని చూస్తూ ఊరుకునేది లేదని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖా మంత్రి లోకేష్ తదితరులకు వివరాలతో కూడిన వినతి పత్రాలను వ్యక్తిగతంగా తమ పార్టీ నేతలు సమర్పిస్తారని, ఈ అంశాలపై ఆందోళనకు సిద్ధమవుతున్నామని ప్రకటించారు. తక్షణం జిల్లా అధికార యంత్రాంగం స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనా కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

సిద్ధార్థ కాలేజీలో విద్యార్థిపై దాడి

- ప్రేమ వ్యవహారమే కారణం
- ఆరుగురిపై కేసు, సస్పెన్షన్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలో పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం విద్యార్థిపై దాడి జరిగిన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ దాడి దృశ్యాలు సోషల్ మీడియాలో కలకలం రేపుతున్నాయి. అమ్మాయికి సంబంధించిన ప్రేమ వ్యవహారం కారణంగా వివాదం ఏర్పడిందని, ఈ నెల 20న దాడి జరిగినట్లు సమాచారం. దాడి చేసిన వారంతా పాలిటెక్నిక్ విద్యార్థులే. వారిలో సత్యసాయి జిల్లాకు చెందిన ఇద్దరు, కడప జిల్లాకు చెందిన నలుగురు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై బాధిత పక్షం చేసిన ఫిర్యాదు మేరకు సెప్టెంబర్ 25న నారాయణవనం పోలీస్ స్టేషన్‌లో ఆరుగురు విద్యార్థులపై కేసు నమోదు చేశారు. కాలేజీ యాజమాన్యం క్రమశిక్షణ చర్యగా ఆరుగురు విద్యార్థులను సస్పెండ్ చేసినట్లు వెల్లడించింది. ఈ సంఘటన ర్యాగింగ్‌కు సంబంధించినది కాదని, వ్యక్తిగత వివాదమేనని పోలీసులు స్పష్టం చేశారు.

డిసెంబర్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతిలో డిసెంబర్ 12,13,14 తేదీల్లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామని ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. ఆహ్వాన సంఘం కమిటీ ఏర్పాటు సోమవారం సాయంత్రం వేమన విజ్ఞాన కేంద్రంలో చేయనున్నట్లు తెలిపారు. ఈ సభలకు విద్యావేత్తలు, పెద్దలు, మేధావులు, ప్రజాసంఘాల నాయకులను ఆహ్వానిస్తున్నామన్నారు. 38 సంవత్సరాల తరువాత ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు తిరుపతిలో జరగనుండడం శుభ పరిణామని తెలిపారు. ఈ మహాసభ కు రాష్ట్ర నలమూలల నుంచి 500 మందికి పైగా విద్యార్థి ఉద్యమంలో చురుకుగా ఉన్న ప్రతినిధులు పాల్గొంటారన్నారు.

హమాలీల రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: సమస్యలు పరిష్కరించాలని, విద్యుత్ శాఖ స్టోర్ హమాలీలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ యాజమాన్యం కనికరం చూపాలని, 40 సంవత్సరాలుగా కష్టాన్ని నమ్ముకుని విద్యుత్ శాఖలో బరువులు మోస్తున్న తమకు న్యాయం చేయాలని కోరారు. కార్మికుల దీక్షకు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి (సిఐటియు) కుమార్ మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ హమాలీలు పాల్గొన్నారు.

బిజెపి గద్దె దిగే వరకు పోరాడతాం : కాంగ్రెస్

ప్రజాశక్తి - సత్యవేడు: ఓట్ల చోరీకి పాల్పడ్డ బిజెపి ప్రభుత్వం గద్దె దిగే వరకు పోరాడుతామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బాలగురవంబాబు స్పష్టం చేశారు. ఆదివారం ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్త పిలుపులో భాగంగా సత్యవేడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రఘునాథ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని శ్రీకాళహస్తి బస్ స్టాప్ నుండి ర్యాలీగా బయలుదేరిన కాంగ్రెస్ నాయకులు గాంధీ విగ్రహం వద్దకు చేరుకుని మానవహారం నిర్వహించారు. బాలగురవం బాబు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్‌ను గుప్పెట్లో పెట్టుకొని ఓట్ల చోరీకి బిజెపి పాల్పడిందని ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగా ఓట్లు తొలగించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఓబీసీ జిల్లా అధ్యక్షులు బాలరాజ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తడ బాబు, జిల్లా సెక్రెటరీ మాణిక్యం, ప్రెసిడెంట్ ఇళయరాజా తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ డిజిటల్ బుక్ ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: వైసీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర రెడ్డి, తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్ రెడ్డి ఆదేశాల మేరకు నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్ర రెడ్డి అధ్యక్షతన ఆదివారం వైసీపీ డిజిటల్ బుక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి వైసీపీ కార్యకర్తల కోసం, కూటమి పాలనలో ఎవరైతే నష్టపోతున్నారో, తప్పుడు కేసులకు బలవుతున్నారో వారికి అండగా డిజిటల్ బుక్ ప్రారంభించడం జరిగిందన్నారు. జరిగిన అరాచకాలను డిజిటల్ కోడ్ ద్వారా లాగిన్ అయ్యి, డిజిటల్ బుక్‌లో అప్లోడ్ చేయాలని తెలిపారు. తద్వారా వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత న్యాయబద్ధంగా చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రాజేంద్ర, గుణిశేఖర్, పసుపులేటి సురేష్, దినేష్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాషువా జయంతి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: కుల రహిత సమాజ నిర్మాణానికి తన రచనలతో ఉద్యమించిన వ్యక్తి, ఎక్కడైతే ఛీత్కరించబడ్డాడో అక్కడే గజవాహనంపై ఊరేగింపబడిన చరిత్ర ఒక్క గుర్రం జాషువాకే దక్కుతుందని పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణ భారత అధ్యక్షులు అంజయ్య పేర్కొన్నారు. తిరుపతి, ఎం.ఆర్.పల్లి, ఆర్.పి.ఐ కార్యాలయంలో "దళిత సాహిత్య వికాస వేదిక" ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతిని ఆదివారం గొడుగు చింత గోవిందయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈకార్యక్రమానికి అతిథులుగా నడ్డి నారాయణ, టీటీడీ ఎస్సీ, ఎస్టీ, ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ ప్రసాదరావులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ 8 యూనివర్సిటీలకు నిలయమైన తిరుపతిలోని యస్వీయు తెలుగు శాఖలో గుర్రం జాషువా పీఠాన్ని స్థాపించి వీరి సాహిత్యంపై విద్యార్థుల చేత లోతైన అధ్యయనం చేయవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు ఏ.సుబ్రహ్మణ్యం, అంబేద్కర్ యువజన సంఘం మంగళం శాఖ అధ్యక్షుడు ఎస్.బాబు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో..

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: వేమన విజ్ఞానకేంద్రంలో నడ్డినారాయణ అధ్యక్షతన, ముఖ్యఅతిథి ఎస్వీ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి గరికపాటి రమేష్ బాబు, టెంకాయల దామోదరంలు జాషావాకు నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ కుల రహిత సమాజం కోసం తన కలం, గళానికి పదును పెట్టి "గబ్బిలం" "పిరదౌసి" వంటి రచనలు చేశారని తెలిపారు. జాతి జాగృతానికి జీవితాన్ని అంకితం చేసిన, నవయుగ కవి చక్రవర్తి, పద్మ విభూషణ్, కళా ప్రపూర్ణ గుర్రంజాషువా అన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు తోటవెంకటేశ్వర్లు, ఆకుల మల్లేశ్వర రావు, ఏనుగు అంకమ నాయుడు, వెంకటాచలపతి మౌని, ఓ.వెంకటరమణ, గొడుగు చింత గోవిందయ్య, వేమన విజ్ఞానకేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున, ఎస్.మునిరాజు, డా రవీంద్ర,ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీ మ్యాంగో రిసార్ట్‌కు

'ఉత్తమ థీమ్-బేస్డ్ రిసార్ట్' అవార్డు

సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మ్యాంగో రిసార్ట్ జియం శ్రీనివాసరావు

ప్రజాశక్తి - సత్యవేడు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పర్యాటక రంగం ఎంపిక చేసిన 2024-25 పర్యాటక ఎక్సలెన్సీ అవార్డులలో "ఉత్తమ థీమ్-బేస్డ్ రిసార్ట్" అవార్డును శ్రీసిటీ మ్యాంగో రిసార్ట్ అందుకుంది. ఇక్కడ అమలుచేస్తున్న స్థిరమైన, ఆకర్షణీయమైన ఆతిథ్య సేవలకు ఈ గుర్తింపు దక్కింది. శుక్రవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ప్రపంచ పర్యాటక దినోత్సవం-2025 వేడుకల సందర్భంగా సీఎం చంద్రబాబు, పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్, సీనియర్ ప్రభుత్వ అధికారులు హాజరైన కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. మాంగో రిసార్ట్ తరుపున రిసార్ట్ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు ఈ గౌరవాన్ని స్వీకరించారు. శ్రీసిటీలోని సుందర సువిశాల ప్రాంతంలో ఉన్న మ్యాంగో రిసార్ట్ 20 లగ్జరీ కాటేజీలు, 10 సాధారణ గదులను కలిగివుంది. ఇక్కడ బస చేసే అతిథులు మంచి ప్రకృతిని వీక్షించడంతో పాటు కయాకింగ్, ట్రెక్కింగ్, సైక్లింగ్, పక్షులను వీక్షించడం వంటి వివిధ రకాల కార్యకలాపాలను ఆస్వాదించవచ్చు. ఇక్కడ గ్లోబల్ కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా రూపొందించబడిన పలు రకాల అంతర్జాతీయ వంటకాలు అందుబాటులో ఉంటాయి. కాగా, వరుసగా రెండవ ఏడాది శ్రీసిటీ మ్యాంగో రిసార్ట్‌కు రాష్ట్ర ప్రభుత్వ పర్యాటకరంగ ఉత్తమ అవార్డులు దక్కడం, ఆతిథ్య సేవల రంగంలో దీని నిబద్ధతను చాటుతుంది.

గుండెకు నడక మంచిదే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: గుండె పది కాలాల పాటు పదిలంగా ఉండాలంటే ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లతో పాటు నడక చాలా అవసరమని ఎంజీఎం సంస్థల డైరెక్టర్ గుడ్డూరు మయూర్ తెలిపారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఎంజీఎం హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం 3కె రన్ నిర్వహించారు. సుమారు 600 మంది 3కె రన్ లో పాలుపంచుకున్నారు. ఎంజీఎం ఆసుపత్రి నుండి 2 టౌన్ పోలీస్ స్టేషన్ వరకు 3కె రన్ సాగింది. 3కె రన్ లో ఉత్సాహంగా పాల్గొన్న అధికారులు, ప్రజలకు మయూర్ అభినందనలు తెలియజేశారు. గుండె ఆరోగ్యం కోసం ఎంజీఎం మెడికల్ ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు రాయితీపైన వైద్య పరీక్షలు, చికిత్సలు అందిస్తోందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్, ఎంజీఎం వైద్యులు పాల్గొన్నారు.

ఆపన్నులకు సుధీర్ అభయ హస్తం

అనారోగ్య బాధితులకు చెక్కు అందిస్తున్న బొజ్జల బృందమ్మ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలకు ఆపదొస్తే ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆపన్న హస్తం అందిస్తున్నారని బొజ్జల బృందమ్మ పేర్కొన్నారు. ఆదివారం ఆమె శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన 18 మంది అనారోగ్య బాధితులకు రూ.11.33 లక్షల సాయాన్ని చెక్కుల రూపంలో ఇంటికి వెళ్లే అందజేశారు. వైద్య ఖర్చులు భరించలేని పేదలకు రాజకీయాలకు అతీతంగా సుధీర్ రెడ్డి సీఎం సాయం అందేలా చొరవ చూపుతున్నారన్నారు. అనా రోగ్య బాధితుల కష్టాన్ని సీఎంకు వివరించి వైద్య బిల్లులు మంజూరయ్యేలా కృషి చేస్తున్నారని తెలిపారు. ఆమె వెంట టిడిపి పట్టణ అధ్యక్షులు విజయకుమార్ నాయుడు తదితరులున్నారు.

హస్త కళల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : చేనేత కళాకారులకు జీవనోపాధిని కల్పిస్తున్న హస్త కళల అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర చేనేత హస్త కళల కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం తొర్రూరులో చేనేత కార్మికులు తయారు చేస్తున్న ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌ను ఆయన స్వయంగా పరిశీలించారు. తొర్రూరు వాస్తవ్యులు ఎంపీఎస్ ఆర్ట్స్ క్రాఫ్స్ నిర్వాహకులు వంశీకృష్ణ, వపన్ కృష్ణలకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ హస్త కళల అభివృద్ధికి సీఎం, డిప్యూటీ సీఎంలతో మాట్లాడి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగరి నియోజకవర్గ జనసేన ఇన్చార్జి మెరుపుల మహేష్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కూటమి ప్రభుత్వంలో అన్యాయానికి గురవుతున్న కార్యకర్తలకు డిజిటల్ బుక్ అండగా ఉంటుందని వైసిపి శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సూచించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆదివారం నియోజవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి కార్యకర్తల కోసం క్యూఆర్ కోడ్ రూపంలో ప్రవేశపెట్టిన డిజిటల్ బుక్‌పై అవగాహన కల్పించారు. కూటమి ప్రభుత్వంలో వేధింపులకు గురవుతున్న నాయకులు, కార్యకర్తలు క్యూ ఆర్ కోడ్ ద్వారా తమ సమస్యలను ఆడియో, వీడియో, ఫోటోల ద్వారా డిజిటల్ బుక్‌లో నమోదు చేసుకోవచ్చని సూచించారు. జగన్ అధికారంలోకి వచ్చాక కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారికి చట్ట పరంగా శిక్షలు పడేలా చేస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి, పగడాల రాజు, కంఠా ఉదయ్ కుమార్, సిరాజ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలం, ఎస్ బి ఆర్ పురం గ్రామ పంచాయితీలో గ్రామాన్ని దత్తత చేసుకున్న సందర్భంగా ఆదివారం, అమెరికాకు చెందిన ఆడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ వారిచే ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ఆ సంస్థ ఫౌండర్ పండేటి భూపతి రాజు సహకారంతో నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ మణి రాజు అండ్ లైజన్ ఆఫర్ కోనేటి రవి రాజులు తెలిపారు. డాక్టర్ బాలకృష్ణ నాయక్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని ఎంపిక చేశారు. వైద్య శిబిరానికి గుండె, కంటి, ఎముకలు, చిన్న పిల్లల జనరల్ వైద్యులు, క్యాన్సర్, నరముల అన్ని రకాల వ్యాధులకు సంబంధించినా 18 మంది వైద్యులు విచ్చేశారు. వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవి రాజు, వాకర్స్ అసోసియేషన్ డిస్టిక్ గవర్నర్ మాధవ నాయుడు, శోభా రాజు, చంద్రశేఖర్ రాజు, రామ్మోహన్ వర్మ, ఎస్ బి ఆర్ పురం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వరవ కాలువ పనులు పునరుద్ధరణ

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు చెరువు నుండి కలుజు నీరు వెళ్లే వరవ కాలువ, పంట కాలువల పనులు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ మహిళా నాయకురాలు గాలి కృష్ణవేణి ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. గతంలో అధిక వర్షాలతో వరవ కాలువ పొంగి జనావాసాల్లోకి నీరు వస్తుండడంతో, సమస్యను నియంత్రించడానికి రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని సుమారు కిలోమీటర్ మేర కాలువ పనులు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

రెవెన్యూ స్థాయి అధికారిని తుడా వీసీగా నియమించండి

రాష్ట్ర ప్రభుత్వానికి చైర్మన్ సూచన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ పోస్టుకు జాయింట్ కలెక్టర్‌ను ఇంచార్జ్‌గా వేయడం వలన అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని, రెవిన్యూ స్థాయి కలిగిన అధికారిని తుడా వీసీగా నియమించాలని, ఇటు తుడ ఉద్యోగులతో పాటు, అటు చైర్మన్ డాక్టర్ దివాకర్ రెడ్డి కూడా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తుడా విసి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఐఎఎస్ అధికారి కావడంతో ఇన్చార్జిగా నియమించడం జరిగింది. తుడా విసి గా మౌర్య ఉన్న సమయంలో తుడాలో పనులు చక చక జరిగేవి. అయితే మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ రాష్ట్ర వ్యాప్తంగా తుడా వైస్ చైర్మన్ పోస్టును జాయింట్ కలెక్టర్ అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలో పలు ఫైల్స్ పెండింగ్లో పడిపోతున్నాయి. జాయింట్ కలెక్టర్ నిత్యం పనుల మీద బిజీగా ఉండడం వల్ల తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ వైపు సరిగ్గా చూడడం లేదని అపవాదులున్నాయి. ముఖ్యంగా తుడా టవర్స్ పనులను ప్రతిరోజు వీసి స్థాయిలో ఉండే అధికారి పరిశీలించడమే కాకుండా మార్పులు చేర్పులు చేయాలంటే తనిఖీలు చేస్తూ ఉండాలి. జాయింట్ కలెక్టర్ తుడా వైస్ చైర్మన్ అదనపు బాధ్యతలు ఇవ్వడం పట్ల జాయింట్ కలెక్టర్ కూడా సంబంధించిన ఫైలు ఆలస్యంగా చూస్తున్నారని ప్రచారం జరుగుతోంది. దీంతోపాటు తుడా పరిధిలో ఉండే పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వాటి స్థాయిలో ఉండే అధికారి వారానికి ఒకసారి పరిశీలిస్తూ ఉండాలి. జాయింట్ కలెక్టర్‌కు అటువైపు పరిశీలించే అవకాశాలు తక్కువ. దీంతోపాటు తుడా ఆదాయ వనరులు పెంచుకోవడానికి పలు లేఅవుట్లు క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉంది. అయితే ఇక్కడ చీఫ్ ప్లానింగ్ అధికారి నేతృత్వంలో పరిశీలన జరుగుతోంది తప్ప, జేసి స్థాయిలో జరగడంలేదనే విమర్శలున్నాయి. దీంతోపాటు శెట్టిపల్లి భూ సమస్య పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న ఈ అంశాన్ని తుడాకు బదిలీ చేయడం జరిగింది. శెట్టిపల్లి స్థలాల అభివృద్ధిపై జేసీ క్షేత్రస్థాయిలో పరిశీలించి చేయాల్సి ఉంటుంది. తుడా సెక్రటరీ లేదంటే, ప్లానింగ్ విభాగం ఈ పనులు నిర్వహిస్తున్నారు. తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ సంబంధించిన ఏదైనా ఆమోదం పొందాలంటే జేసి అందుబాటులో ఉంటే తప్ప లేదంటే ఆ ఫైల్ ఆలస్యం అవుతుందని పలువురు అంటున్నారు. తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి అనేక సందర్భాల్లో పలు పనుల అనుమతులపై జేసీకి ఫోన్ చేసి అందుబాటులో ఉన్నారా లేదా తెలుసుకొని కొన్ని పనులు చేసుకోవాల్సి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలో వీసీ స్థాయి పోస్టు జేసీగా ఉంటేనే రెవెన్యూ సమస్యలు సులభంగా పరిష్కారమవుతాయని భావిస్తోంది. అయితే ఇక్కడ తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ మాత్రం వీసీగా చేసి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ ఇక్కడ ఉద్యోగులు ఫైలు కలెక్టరేట్ కార్యాలయం వెళ్లి జేసి దగ్గరకు సంతకాలు పెట్టించుకోవాల్సిన పరిస్థితి ఉంది. చిన్న చిన్న పనుల కోసం జేసిని ఆశ్రయించాల్సి వస్తుంది. ఆయన సమావేశాలు, తనిఖీలు చేయడానికి ఇతర ప్రాంతాలకు వెళుతూ ఉంటారు. ఆయన అందుబాటులో ఉంటే తప్ప ఈ చిన్న చిన్న పనులు జరిగేవి కావు. రెవెన్యూ అధికారి స్థాయి ఉండేవారిని తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ పదవిని నియమిస్తే, ఇటు ఉద్యోగులకు అటు పాలకవర్గానికి ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో తెలియాల్సి ఉంది.

తుడా ఆదాయం పెంపుపై దృష్టి..

తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలో ఆదాయ వనరులు పెంచుకోవడానికి అధికారులు దృష్టి సారించారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ప్రత్యేక దృష్టి సారించారు. శెట్టిపల్లిలో 65 ఎకరాలు తీసుకొని వాటిని అభివృద్ధి చేసి వాటి ద్వారా ఆదాయం పెంచుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీంతోపాటు నాయుడుపేట, సత్యవేడు, ఇతర ప్రాంతాల్లో టౌన్ షిప్పు ఏర్పాటు చేసి ఆదాయ వనరులు పెంచుకోవడానికి చర్యలు చేపట్టారు.

దామినేడు ప్లాట్లకు '22ఏ' నుంచి విముక్తి కల్పించాలి

సమావేశం మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి గుర్రప్ప

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి జిల్లా, దామినేడులో ఇళ్ల ప్లాట్లు కలిగిన జాబితాలో 22 ఏ నుంచి విముక్తి కల్పించాలని విశ్రాంత జడ్జి గుర్రప్ప డిమాండ్ చేశారు. తిరుపతి, బాలాజీ కాలనీ, అంబేద్కర్ భవన్‌లో ఈ విషయమై ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్జి గుర్రప్ప, న్యాయవాది అజితా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫ్లాట్ల ఓనర్స్‌ను ఉద్దేశించి గుర్రప్ప మాట్లాడుతూ దామినేడు ప్లాట్లను 22 ఏ జాబితాలో చేర్చడం అన్యాయమని, ఇనాము భూములను ప్రభుత్వం ఇనాము అబాలిష్ యాక్ట్‌లో రైతులకు పట్టాలు ఇచ్చిందని తెలిపారు. రైతులు ఇళ్ల స్థలాల కింద ఇప్పటికే నాలుగు రిజిస్ట్రేషన్లు చేసుకొని ఉన్నారన్నారు. రెవెన్యూ యంత్రాంగం ఈ స్థలాలను రెవెన్యూ రికార్డులలో నమోదు చేసుకోక వాటిని ఇప్పటివరకు ప్రభుత్వ భూములుగానే పరిగణిస్తున్నారని, ఇది ఫ్లాట్ ఓనర్స్‌కు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఎంత మాత్రం న్యాయ సమ్మతం కాదు. ప్రభుత్వం గజిట్ నోటిఫికేషన్ లో పొందుపరిచి రైతులకు పట్టాలు ఇచ్చారని తెలిపారు. న్యాయవాది అజిత గారు మాట్లాడుతూ ఇళ్ల స్థలాలను కూడా 22ఏ జాబితా నుంచి మినహాయించడం న్యాయబద్ధంగా ఉంటుందన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ఫ్లాటు యజమానులు, ఎస్. మీరయ్య,(రైల్వే రిటైర్ ఉద్యోగి), కే.నాగేశ్వరరావు (రైల్వే రిటైర్ ఉద్యోగి), పి.శారద రైల్వే ఉద్యోగి, జి. విజయ్ కుమార్ (రిటైర్డ్ రైల్వే ఉద్యోగి), పి. శ్రీనివాసులు (రైల్వే రిటైర్డ్ ఉద్యోగి), భాస్కర్ నాయుడు, శ్రామసుబ్బమ్మ, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రమణ్యం నాయుడు కర్మక్రియలకు హాజరైన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, పనపాకం పంచాయతీ, గడ్డంవారిపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, డిసిఎంఎస్ చైర్మన్ పల్లినేని సుబ్రమణ్యం నాయుడు కర్మక్రియలు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పులివర్తి నాని కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ ఆయన పార్టీకి ఎనలేని సేవలు అందించార న్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

షణ్ముగంకు ఉత్తమ ప్రకృతి వ్యవసాయ విస్తరణ అధికారి అవార్డు

ప్రజాశక్తి - రామచంద్రాపురం : ఏరువాక ఫౌండేషన్ నిర్వహించిన ఏరువాక కిసాన్ మహోత్సవం-2025 కార్యక్రమం గుంటూరులోని కేఎల్ యూనివర్సిటీలో 26, 27 తేదీల్లో ఎగ్జిబిషన్, చర్చావేదిక, సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ సోము వీర్రాజు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ, అనుబంధ విభాగాల్లో ప్రతి సంవత్సరం తెలుగు రాష్ట్రాల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారిని ప్రోత్సహించేందుకు ఏరువాక ఫౌండేషన్ వారు అవార్డులు అందించే కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. ఇందులో భాగంగానే 2024 వ్యవసాయ వార్షిక వార్డులు ఆంధ్రప్రదేశ్ విభాగంలో కొంతమందిని ఎంపిక చేసినట్టు తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో మహిళా భాగస్వామ్యంతో రైతులను చైతన్య వంతులను చేస్తూ కృషి చేసినందుకు తిరుపతి జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రాజెక్టు మేనేజర్ ఎ.షణ్ముగంకు ఉత్తమ ప్రకృతి వ్యవసాయ విస్తరణ అధికారి అవార్డు అందించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వైస్ చైర్మన్ అగ్రిమిషన్ శ్రీనివాస్ రెడ్డి, జిడిసిఎంఎస్ చైర్మెన్ హరిబాబు, పలువురు వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ఫల సరుకులు పంపిణీ



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, సిఆర్ రెడ్డి కళ్యాణ మండపంలో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రెడ్ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధ్యక్షులు శ్రీకి రెడ్డి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ సంఘం ద్వారా పేద రెడ్లకు సహాయం చేస్తామని, రెడ్ల కే కాకుండా ఇతరులకు కూడా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా సుమతి రెడ్డి మాట్లాడుతూ సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం మీద ఉన్న అభిమానంతో ఇంత దూరం వచ్చానని, ఈ సంఘం చేస్తున్న సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేయాలని, నా వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. గున్నం సేవా ట్రస్ట్ అధినేత గున్నం రెడ్డి మధుసూదన్ రెడ్డి 25 మంది పేదలకు నెలకు సరిపడా నిత్యవసర సరుకులు, రెడ్డి సంక్షేమ సంఘం కోసం విరాళాలను అందజేశారు. అనంతరం సనత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రెడ్లు ఆర్థికంగా వెనకబడి ఉన్నారని వారిని ప్రభుత్వ ఆదుకోవాలన్నారు. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి దానికి నిధులు కేటాయించి, పేద రెడ్లకు సబ్సిడీతో కూడిన రుణాల అందజేయాలన్నారు. ఈ సందర్భంగా వంజవాక సతీష్ రెడ్డి, శ్యాం ప్రసాద్ రెడ్డిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పేట వెంకటకృష్ణారెడ్డి, బండి ధనంజయ రెడ్డి, సిద్ధారెడ్డి, రాఘవరెడ్డి, ఎల్లసిరి గోపాల్ రెడ్డి, మీరా రెడ్డి, కోట రెడ్డి సంఘం నాయకులు, నెల్లూరు రెడ్డి సంఘం నాయకులు, చిలుకూరు, కోట,వాకాడు, చిట్టమూరు మండలాల నుండి వచ్చిన నాయకులు పాల్గొన్నారు.

జిల్లా క్రికెట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్ష కార్యదర్శులుగా శ్రీనివాసమూర్తి, సతీష్ యాదవ్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసి యేషన్(సిడిసిఏ) నూతన కార్య వర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు ఎలక్షన్ ఆఫీసర్ గా సీనియర్ అడ్వకేట్ రాజేష్ బాబు వ్యవహరించారు. ఇందులో భాగంగా ఆయన నూతన కమిటీని ప్రకటించారు. నూతన అధ్యక్షులుగా టి. శ్రీనివాసమూర్తి, సెక్రటరీగా మందపాటి సతీష్ యాదవ్, ట్రెజరర్ గా సి.జె శివప్రసాద్ ఎన్నిక కాగా వైస్ ప్రెసిడెంట్ గా శ్రీధర్ కుమార్, జాయింట్ సెక్రటరీగా కోలాహరి ఎన్నికయ్యారు. అదేవిధంగా ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా వై.మురళి యాదవ్, ఎస్.రవి, డి. వెంకట్ రమణ, డి. దివాకర్, సి. గిరి ప్రకాష్, జి. దివాకర్, బి.రాజేంద్ర, ప్రసాద్ శర్మ, జే.మార్కండేయులు, కే. ప్రకాష్ నాయుడు, ఎస్. ఖాదర్ బాషా, పీ.కే. సత్యశ్రీనివాసన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో ఉన్నారు. అనంతరం అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసమూర్తి, సతీష్ యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుత ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ)జాయింట్ సెక్రటరీ, పూర్వపు సిడిసిఏ అధ్యక్షులు విజయ్ కుమార్ (క్రికెట్ విజయ్) ఉమ్మడి చిత్తూరు జిల్లాలలో క్రికెట్‌ను ఎంతో అభివృద్ధి చేశారన్నారు. జిల్లా క్రికెట్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అన్ని ఫార్మాట్ లలో జిల్లా జట్లు విజేతలగా నిలవడానికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని జిల్లాలో క్రికెట్ ను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ప్రతిభ ఉన్న క్రికెట్ క్రీడాకారులకు ఉన్నత భవిష్యత్తు అందించడమే ధ్యేయంగా ముందుకు వెళతామని పేర్కొన్నారు. జిల్లాలో ఉత్తమ ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నప్పటికీ సరైన క్రీడా మైదానం లేక ఇబ్బంది పడుతున్నారు. గత కమిటీ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా వారు సానుకూలంగా స్పందించడమే కాక జిల్లాలో క్రీడా మైదానాల ఏర్పాటుకు అన్ని విధాల కృషి చేస్తామని తెలుపడం జరిగిందన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం, ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ తో మాట్లాడి త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. మంచి క్రీడా మైదానాలు ఉండడం వలన క్రీడాకారులు మరింత గొప్పగా రాణించగలరని, ఉన్నతమైన క్రికెట్ ఆడగలరని, అందుకు తమ కమిటీ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు.

ముగిసిన ఎంట్రీ లెవెల్ అంపైర్స్, స్కోరర్స్ శిక్షణ శిబిరం

గత రెండు రోజులుగా ఉమ్మడి చిత్తూరు జిల్లా సీనియర్ క్రికెటర్ల ఉపాధి కల్పనలో భాగంగా చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంట్రీ లెవెల్ అంపైర్స్, స్కోరర్స్ శిక్షణ శిబిరం విజయవంతంగా ముగిసింది. ఇందులో జిల్లాలోని క్రికెట్ క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని శిక్షణ పొందారు. ఈ శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులకు త్వరలో పరీక్షలు నిర్వహించనున్నట్లు చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు, ఏసిఏ జాయింట్ సెక్రెటరీ విజయకుమార్(క్రికెట్ విజయ్) తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందులో శిక్షణ పొందడం వలన రానున్న క్వాలిఫైడ్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలను పొందే అవకాశాలు ఉన్నాయన్నారు. అదేవిధంగా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నిర్వహించే క్వాలిఫైడ్ అంపైర్స్, స్కోరర్స్ పరీక్షలకు ఇవి ఎంతో ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. కావున జిల్లా క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తీర్ణత సాధించాలని క్రికెట్ విజయ్ కోరారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రవి, కోశాధికారి గిరి ప్రకాష్, ఉపాధ్యక్షులు శ్రీనివాసమూర్తి, శ్రీధర్, జాయింట్ సెక్రెటరీ సతీష్ యాదవ్, సభ్యులు మురళి యాదవ్, కోలా హరిప్రసాద్, దివాకర్, రవి, మార్కండేయులు, సత్య శ్రీనివాస్, శివప్రసాద్, రమణ, ప్రకాష్, కోచ్ లు సునీల్, క్వాలిఫైడ్ అంపైర్స్ సుదర్శన్,అన్సర్ ఖాన్, అకుల్ అన్నా,రామకృష్ణ, హష్నావల్లి, కిరణ్, ఉదయ్, అకీబ్ తదితరులు పాల్గొన్నారు.

అలిపిరిలో అన్నదానం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి, అలిపిరి పాదాల వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి శ్రీశ్రీనివాస ఆధ్వర్యంలో ఆదివారం గరుడసేవ సందర్భంగా తిరుమలకు కాలినడకన వచ్చే సుమారు 1000 మంది యాత్రికులకు అన్నదానం, ఆపిల్ పండ్లు వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి లయన్స్ ఇంటర్నేషనల్ డిస్టిక్ చైర్పర్సన్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ విచ్చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ సురేష్, ఉపాధ్యక్షురాలు శాంతి నాడార్, శేషాద్రి, జీవన్, విష్ణు, కాంద్ర విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతి దేవిగా చెంగాలమ్మ

ప్రజాశక్తి-ఏర్పేడు: పాత వీరపురం గ్రామంలో శరవన్న రాత్రి ఉత్సవాలలో భాగంగా ఏడోవ రోజు శ్రీ చెంగాలమ్మ దేవత పార్వతి దేవి రూపంలో భక్తులకు ప్రత్యేక అలంకారంలో దర్శనం ఇచ్చారు. చిన్న రెడ్డి, హరిదాసు రెడ్డి, మహాలక్ష్మి, చిన్నమ్మ ఉబయదారుల సమక్షంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించిన అనంతరం అన్నదానం కార్యక్రమం చేపట్టారు. గ్రామ సర్పంచ్ మంజుల, మునిరత్నం రెడ్డి, చెంగారెడ్డి, గురవారెడ్డి, జమున ఆలయ పూజారి మహేంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

శ్రీకాళహస్తిలో గ్యాంగ్ వార్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఓ హోటల్ వద్ద బిర్యానీ విషయంలో ఏర్పడ్డ వివాదం రెండు గ్రూపుల మధ్య గ్యాంగ్ వార్‌కు దారి తీసింది. పట్టణమంతా నిద్రిస్తున్న వేళ యువకులు రెండు గ్రూపులుగా విడిపోయి వీధుల్లో పరిగెడుతూ దాడులు చేసుకోవడంతో ప్రజలంతా ఒక్కసారిగా ఉలిక్కి పడి లేచారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి అలజడికి కారణమైన యువకులను చితకబాదారు. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి శ్రీకాళహస్తి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి..పట్టణంలోని నగరి వీధిలో ఉన్న ఓ హోటల్ వద్ద ఓ కూటమి నేత అనుచరుడు బిర్యానీ అంశంలో యాజమాన్యంతో గొడవకు దిగాడు. గొడవ కాస్త ముదరడంతో కొట్టుకునే వరకు వెళ్లారు. రెండు గ్రూపులుగా విడిపోయి పలు చోట్ల ఘర్షణకు దిగారు. దాడులు చేసుకున్నారు. పరిస్థితిపై 100కు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి యువకులను చెదరగొట్టారు. తిరగబడ్డవారిని చితకబాదారు. పరస్పర దాడుల్లో గాయపడ్డ కూటమి నేత అనుచరుడిని చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అతని ఫిర్యాదు మేరకు కొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కార్మిక వర్గాన్ని చైతన్యపరుద్దాం : ఏఐటీయూసీ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గాన్ని చైతన్య పరుద్దామని సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం తిరుపతి, బైరాగి పట్టెడ, గంధమనేని శివయ్య భవన్లో జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు కార్మిక వర్గం జరుగుతున్న తీవ్ర నష్టం ఏఐటియుసి నిర్వహించాల్సిన పాత్రపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి, ఏఐటియుసి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, రాధాకృష్ణలు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, లేబర్ కోడ్స్ అమలు చేయడంలో చంద్రబాబు ప్రభుత్వం మోడీ మెప్పుకోసం శరవేగంగా అమలుపరి చేందుకు సిద్ధపడటం దుర్మార్గమన్నారు. కార్మిక వర్గాన్ని కదిలించాలి, పోరాటాలను తీవ్రతరం చేయాలి, అందుకు ఏఐటీయూసీ కార్యకర్తలు కదన రంగంలోకి దిగాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో శ్రీరాములు. ఎన్‌డి రవి. శివ, కెవై రాజా తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత.. అందరి బాధ్యత

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక మున్సిపాలిటీ పరిధి, 19వవార్డులో మన వార్డు పరిశుభ్రత - మన అందరి బాధ్యత అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువత, మహిళలు పాల్గొని పరిసరాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో కృష్ణకుమార్ మాట్లాడుతూ యువతలో సేవాభావం పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. వార్డు టీడీపీ ఉపాధ్యక్షులు, స్కంద ట్రావెల్స్ ప్రొప్రైటర్ మోహన్ కృష్ణ తన వంతు సహాయంగా 50 మందికి టీ షర్ట్‌లు ఇచ్చారని ధన్యవాదాలు తెలిపారు.

కొనుగోలుకు ఊతం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కేంద్ర ప్రభుత్వ జీఎస్టీ తగ్గింపు సంస్కరణలు ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగేలా చేస్తాయని టీడీపీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.ఎం.ఉమేష్ రావు ఆదివారం కొనియాడారు. తొలిసారి తగ్గిన ట్రూ అప్ భారం కారణంగా 923 కోట్లు వినియోగదారులకు సర్దుబాటు చేసినట్లు గుర్తు చేశారు. పండుగ వేళ విద్యార్థులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెబుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ. 400 కోట్లు విడుదల చేసిందని కొనియాడారు. విద్య ఉపాధి కల్పనలో విజనరీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎవరూ సాటిరారని కితాబిచ్చారు. మిన్నల్ రవి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలం, తట్నేరి కన్నికాపురం ఎస్టీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ నిధులు మంజూరు చేయించి, బోరు వేయించారు. నీరు పుష్కలంగా పడటంతో, మోటర్ బిగించండంతో కాలనీ వాసులకు నీటి సమస్య పరిష్కారమయింది. కాలనీ వాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-ఏర్పేడు: అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఏర్పేడు తాసిల్దార్ భార్గవి హెచ్చరించారు. కొత్త వీరాపురం సమీపంలోని స్వర్ణముఖి నది బ్రిడ్జి వద్ద అక్రమ ఇసుక రవాణా జరగకుండా రెవెన్యూ సిబ్బంది, వీఆర్వో శ్రీవిద్య, వీఆర్ఏలు జగదీష్, నాగరాజులను పంపి ట్రాక్టర్లు, ఇతర వాహనాలు వెళ్ళకుండా జెసిబి ద్వారా ట్రెంచింగ్ ఏర్పాటు చేయించామని ఆమె తెలిపారు.